సాక్షి
కర్నూలు
గురువారం । 12 । జూన్ । 2025



అదిరేటి డ్రస్సు మేమేస్తే ..
ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని గుడేకల్ గ్రామ యువకులు సరికొత్త రూపంలో దర్శనమిచ్చారు. హీరోల గెటప్స్‌తో ఊరేగింపుగా వస్తూ ప్రజలను అకట్టుకున్నారు. 8లో▸



ఇంకెన్నాళ్లు..
రేకుల పెడ్డులో క్యూ కంపార్ట్‌మెంట్లు ఉండడంతో శ్రీశైలానికి వచ్చిన భక్తులు అవస్థలు పడుతున్నారు. 'పరమేశ్వరా.. కష్టాలు తీర్చవా' అని వేడుకుంటున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,602.28
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:24.646
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:3,308
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:185

న్యూస్‌రీల్

సహకార శాఖలో పరిమితంగా బదిలీలు

కర్నూలు(అగ్రికల్చర్): సహకార శాఖలో బదిలీలు పరిమితంగా జరిగాయి. నంద్యాల సబ్ డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఉన్న రాచయ్య కర్నూలు సబ్ డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్-1 బదిలీ అయ్యారు. నంద్యాల డీఎల్‌సీవో కార్యాలయం నుంచి సీనియర్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్‌బాబు కర్నూలు డీఎల్‌సీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. కర్నూలు డీఎల్‌సీవో కార్యాలయం నుంచి కేఎల్‌ఎస్ ప్రసాద్ నంద్యాల సబ్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. డీసీఏవో కార్యాలయంలోమ ఉనన మహబూబ్‌దౌళ అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. సిద్దవటంలో ఉన్న రహమత్ అలీ కర్నూలు డీసీఏవో కార్యాలయానికి బదిలీ అయ్యారు.

పత్తికొండ ఆర్‌డీఓపై విచారణ

కర్నూలు(సెంట్రల్): పత్తికొండ ఆర్‌డీఓ భరత్ నాయక్‌పై వచ్చిన అనామక ఫిర్యాదుపై జేసీ డాక్టర్ బి.నవ్య బుధవారం విచారణ చేపట్టారు. ఇటీవల ఆర్‌డీఓపై డివిజన్ పరిధిలోని 18 గ్రామాల వీఆర్వోలు వివిధ ఆరోపణలు చేస్తూ సీసీఎల్ఏ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విచారించాలని జేసీని ఆదేశించిన నేపథ్యంలో బుధవారం సంబంధిత 18 గ్రామాల వీఆర్వోలను పిలిచి విచారణ నిర్వహించారు. ఒక్కో వీఆర్వోను విడివిడిగా విచారించి వివరాలను నమోదు చేశారు. చివరకు వారంతా తాము ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలపడంతో ఆర్‌డీఓకు క్లీన్‌చిట్ ఇచ్చారు. కాగా, ఇకపై అనామక ఫిర్యాదులు చేస్తే కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు జేసీ డాక్టర్ బి.నవ్య తెలిపారు.

పాఠశాలలకు సన్నబియ్యం

కర్నూలు(సెంట్రల్): పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలకు సన్న బియ్యాన్ని సరఫరా చేయనున్నట్లు జేసీ డాక్టర్ బి.నవ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్యూఆర్ కోడ్ కలిగిన 25 కేజీల ప్యాకెట్లను ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి పాఠశాలలకు నేరుగా సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలోని 1,434 ప్రాథమిక నుంచి ఉన్నత పాఠశాలలు, 160 సంక్షేమ వసతి గృహాలకు ఈ బియ్యాన్ని సరఫరా చేస్తామన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ధాన్యం పండించిన రైతుల వివరాలతో పాటు నాణ్యత తెలుసుకోవచ్చన్నారు.

లా పరీక్షల ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో గత ఏప్రిల్‌లో జరిగిన ఎల్ఎల్‌బీ 3, 5 సంవత్సరాల 3, 5, 7, 9 సెమిస్టర్ల రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేశారు. వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు ఆదేశాల మేరకు ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

మొక్కుబడిగానే!



☛ సి.బెళగల్ మండలం యనగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1.38 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టారు. పునాదులు వేసి బేస్‌మెంట్ లెవెల్ వరకు పనులు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పనులను పట్టించుకోకపోవడంతో నిలిచిపోయాయి. దీంతో స్కూల్‌లో చాలీచాలని గదుల్లో విద్యార్థులు చదువుకోవాల్సి వస్తోంది.

☛ కర్నూలు నగరంలో బిక్యాంపు బాలురు ఉన్నత పాఠశాలలో సుమారు రూ.5లక్షలకుపైగా ఖర్చు పెట్టి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. అయితే ఆ స్కూల్లో ప్లాంట్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఏడాదికిపైగా మూలకు చేరింది. దీంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందిపడక తప్పని పరిస్థితి.





కర్నూలు బీ క్యాంపులోని బాలికల స్కూల్‌లో టాయ్‌లెట్ల దుస్థితి

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

- పూర్తికాని ఉపాధ్యాయుల బదిలీలు
- అసంపూర్తిగానే అదనపు తరగతి గదుల నిర్మాణం
- అస్తవ్యస్తంగా మారిన టాయ్‌లెట్ల నిర్వహణ
- పాఠశాలలకు అరకొరగానే కిట్లు
- ఇప్పటికీ జిల్లాకు చేరని బూట్లు, యూనిఫాం, బ్యాగ్‌లు
- చాలా చోట్ల పనిచేయని ఆర్వో ప్లాంట్లు

కర్నూలు సిటీ: కొత్త విద్యా సంవత్సరం విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలకనుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయగా, కూటమి ప్రభుత్వం ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించింది. ఫలితంగా అదనపు తరగతి గదులు, టాయ్‌లెట్లు, రక్షణ గోడ నిర్మాణ పనులు ఏడాదిగా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇక వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పూర్తి చేస్తామని, ఇందుకోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని కూటమి ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంది. కానీ పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నా బదిలీల ప్రక్రియ కొలిక్కిరాని పరిస్థితి. ఈ కారణంగా చాలావరకు పాఠశాలలు ఉపాధ్యాయులు లేకుండానే తెరుచుకోనున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలతో పాటు, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మిత్ర కిట్లు ఇస్తామని ప్రకటించినా అరకొరగానే సిద్ధం చేశారు.



కర్నూలు బి.క్యాంప్ బాలుర స్కూల్‌లో విరిగిపోయిన బెంచీలు




స్కూల్ ఆవరణలో పాడైపోయిన కుళాయిలు

నేటి(గురువారం) నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా ఆ మేరకు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అయితే బదిలీల్లో తలమునకలవుతున్న విద్యాశాఖ అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

వెక్కిరిస్తున్న అసంపూర్తి నిర్మాణాలు

జిల్లాలో 1,436 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మన బడి నాడు-నేడు కింద రెండు విడతలుగా పనులు చేపట్టింది. మొదటి విడతలో 594 పాఠశాలల్లో రూ.166.25 కోట్లు ఖర్చుపెట్టి 9 రకాల మౌలిక సదుపాయాలు కల్పించే పనులు పూర్తి చేశారు. రెండో విడతలో 1,051 స్కూళ్లలో రూ.504.16 కోట్లతో పనులు చేపట్టారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పనులు పూర్తి చేయకుండానే నిలిపేసింది. దీంతో అదనపు తరగతులు, రక్షణ గోడలు, టాయ్‌లెట్ల నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పీఎంశ్రీ పథకం కింద చేపట్టిన పనులు చేస్తున్నప్పటికీ బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఆగుతూ సాగుతున్న పరిస్థితి. కేజీబీవీల్లో చేపట్టిన అదనపు తరగతి గదుల పనులు, డార్మెటరీల పనులు సైతం పూర్తి కావట్లేదు. పాఠశాలల శుభ్రతకు 1,741 మంది ఆయాలు ఉండగా మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో చాలా స్కూళ్లలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.



మధ్యాహ్న భోజనం గదిలో ఎలుకలు రంధ్రాలు చేయడంతో అపరిశుభ్రత

ఫీజులను భరించలేకున్నాం



నాకు వ్యవసాయమే జీవనాధారం. ఇద్దరు పిల్లలు సంతానం. గూళ్యంలోని ప్రయివేట్ పాఠశాలలో ఒక అబ్బాయి ఐదో తరగతికి, మరో అబ్బాయి 3వ తరగతి చదువుతున్నారు. మొదటి అబ్బాయికి అడ్మిషన్ ఫీజు రూ.25 వేలు. 3వ తరగతి చదువుతున్న అబ్బాయికి రూ.20 వేలు దాకా తీసుకుంటున్నారు. స్కూల్ యూనిఫాం, షూకు రూ.6 వేలు అదనంగా చెల్లించాలి. సంవత్సరానికి రూ.50 వేలకు పైగానే ఖర్చు అవుతోంది. అంత డబ్బు చెల్లించేందుకు చాలా ఇబ్బంది పడుతున్నాం. జూన్ నెల వస్తుందంటే గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నట్లు ఉంటుంది.

– మునిస్వామి, సిద్దాపురం గ్రామం, హాలహర్వి మండలం

పనిచేయని ఆర్వో ప్లాంట్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో రూ.24.47 కోట్లు వెచ్చించి 567 పాఠశాలల్లో మొదటి విడతలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. రెండో విడతలో 709 పాఠశాలల్లో రూ.23.05 కోట్లతో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు పనులు మొదలుపెట్టారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్లాంట్ల నిర్వహణను విస్మరించింది. ఈ కారణంగా జిల్లాలో 100కు పైగా ఆర్వో ప్లాంట్లు మూలనపడ్డాయి. ఫలితంగా విద్యార్థులు మంచి నీటి కోసం బాటిళ్లు తెచ్చుకోవడమో, వీధుల వెంట తిరగడమో చేయాల్సి వస్తోంది.

బడికి చేరని కిట్లు

- జిల్లాలోని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 2.69 లక్షల మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు సర్వేపల్లి రాధాకృష్ణ మిత్ర పథకం కింద కిట్లను పంపిణీ చేయాల్సి ఉంది.
- ఇందులో నోటు పుస్తకాలు, బెల్టులు, డిక్షనరీలు, బ్యాగులు, స్కూల్ యూనిఫాం, వర్క్, టెక్స్ట్ బుక్స్ ఇవ్వనున్నారు.
- అయితే నోట్ బుక్స్ 15,35,732, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు 28,408, బెల్టులు 1 నుంచి 10 వరకు బాలురు, 1 నుంచి 5 వరకు బాలికలకు 1,90,782 వచ్చాయి.
- 6 నుంచి 10 తరగతుల వరకు చదివే బాలికలకు బెల్టులు రావాల్సి ఉంది.
- వర్క్ బుక్‌లు 2,37,035కు గాను 2,30,783.. టెక్స్ట్ బుక్‌లు 9,82,400కు గాను 9,54,382 మాత్రమే వచ్చాయి.
- బూట్లు 2,71,006, పిక్టోరియల్ డిక్షనరీలు (ఫస్ట్ క్లాస్) 20,952, యూనిఫాం 2,69,321 మందికి ఒక్కొక్కరికి మూడు జతల చొప్పున రావాల్సి ఉంది.
- పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్క్ బుక్‌లు మాత్రమే పునఃప్రారంభం రోజున ఇవ్వనున్నారు.
- మిగిలినవి ఈనెల 16వ తేదీ తర్వాత ఇవ్వనున్నట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది.

స్కూళ్లకు పూర్తిగా చేరని సన్నబియ్యం

జిల్లాలోని 1,433 స్కూళ్లలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద అన్ని స్కూళ్లకు సన్నబియ్యంతో తయారు చేసిన భోజనాన్ని అందిస్తామని ప్రకటించారు. అయితే ప్రధానోపాధ్యాయులు చాలా మంది బదిలీ అయ్యారు. కొత్తగా చేరిన స్కూల్లో యాప్ అప్‌డేట్‌కు కొంత సమయం పడుతుంది. దీంతో స్కూళ్లకు బియ్యంతో పాటు మిగిలిన వస్తువుల ఇండెంట్‌పై స్పష్టత కరువైంది. అదేవిధంగా కోడిగుడ్లు, చిక్కీలు సైతం సగానికిపై స్కూళ్లకు చేరలేదని తెలుస్తోంది.

రమేష్ కుటుంబానికి అండగా ఉంటాం



రమేష్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- పార్టీ నుంచి రూ.2 లక్షల నగదు అందజేత
- సొంతంగా మరో రూ. 50 వేలు ఇచ్చిన కాటసాని

ఓర్వకల్లు: రమేష్ కుటుంబానికి అండగా ఉంటామని, అన్ని విధాలా ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మీదివేముల గ్రామానికి కాటసానితోపాటు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జీకే వెంగన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం వెళ్లారు. రమేష్ నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. పార్టీ నుంచి వచ్చిన రూ.2 లక్షల చెక్కును, కాటసాని స్వతహాగా మరో రూ.50 వేలను అందజేశారు. అనంతరం కాటసాని రాంభూపాల్‌రెడ్డి విలేకరుతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు నేరపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

'రెడ్‌బుక్' పేరిట నేరం!

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో నేర రాజకీయాలను టీడీపీ నేతలు ప్రోత్సహిస్తున్నారని కాటసాని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసి ఏడాది కాలమైనా హామీల అమలులో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను పక్కదోవ పట్టించేందుకు నేరపూరితమైన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గ్రామాభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా రమేష్ నాయుడు పనిచేసేవాడని, అతను లేకపోవడం పార్టీకి తీరని లోటని అభిప్రాయపడ్డారు.

రాజకీయంగా ఎదుర్కోలేకనే..

తాను ఫ్యాక్షన్ కుటుంబం నుంచే వచ్చానని, దాని వల్ల కలిగే నష్టాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకొని ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహించడం లేదని కాటసాని గుర్తుచేశారు. రమేష్ నాయుడి రాజకీయ ఎదుగుదలను జీర్ణించుకోలేకనే టీడీపీ వారు ఈ నెల 5న హత్య చేశారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. హంతకులు ఎవరనేది ఇప్పటికే తేలిపోయిందని, హత్య వెనుక ఎవరి పాత్ర ఉందో తనకు తెలుసని, పోలీసులపై ఉన్న నమ్మకంతో చట్టానికే వదిలేస్తున్నామన్నారు. ఈ కేసులో నిజమైన హంతకులను గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రశాంతమైన ఓర్వకల్లు మండలంలో హత్యా రాజకీయాలను ప్రోత్సహించే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు చెన్నారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నాగ తిరుపాలు, హరినాథ్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, సోమ శేఖర నాయుడు, బీరం పుల్లారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

క'రుణ'లేక.. కష్టాలు తొలగక!

- ఏరువాక పండుగ రోజూ రైతులకు అవే అవస్థలు
- స్పందించని రాష్ట్ర ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 నుంచి 2024 వరకు అన్నదాతలకు అన్ని విధాలుగా సాయం అందించింది. ప్రతి ఏటా మే నెల 15 నుంచే విత్తనాల పంపిణీ జరిగేది. ఖరీఫ్ సీజన్ మొదలవుతుందంటే వైఎస్సార్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందేది. అలాగే ఉచిత పంటల బీమా కింద పరిహారం పంపిణీ చేసేవారు. ప్రతి ఏటా మృగశిర కార్తె వచ్చే పౌర్ణమి రోజున 'ఏరువాక' వేడుకలు ఘనంగా నిర్వహించేవారు.



తుగ్గలి మండలంలో పొలాన్ని దున్నుతున్న రైతు

కర్నూలు(అగ్రికల్చర్): ''పదవులు స్థిరమని భ్రమించే వాళ్లు.. ఓట్లు గుంజి నిను మరిచే వాళ్లు.. నీవే దిక్కని అబద్ధాలు చెప్పే వారు.. హామీలు ఇచ్చి అమలు చేయని వారు.. రోజులు మారాయ్..'' అనే పాటను రైతులు పాడుకుంటున్నారు. ఏరువాక పౌర్ణమి రైతులకు పెద్ద పండుగ. ఎద్దులకు పరుగు పందేలు నిర్వహించి గెలిచిన వృషభాలకు ఆహారంగా ధాన్యం పెట్టి.. అవి తినగా మిగిలిన వాటిని రైతులు తీసుకెళ్లి విత్తనాల్లో కలుపుకుంటారు. ఇలా చేస్తే పంట బాగా వస్తుందనే నమ్మకం రైతుల్లో ఉంది.

రైతులను మరచిపోయిన రాష్ట్ర ప్రభుత్వం

స్వేదాన్ని చిందిస్తూ సేద్యానికి ఊపిరి పోసే రైతులను రాష్ట్ర ప్రభుత్వం మరచిపోయింది. పుడమితల్లికి సౌభాగ్యాన్ని అందించే అన్నదాతల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటికీ ఏరువాక ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. పంటల సాగుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం దక్కలేదు. పెట్టుబడులకు కనీసం బ్యాంకులు రుణాలు ఇవ్వని దుస్థితి నెలకొంది. దీంతో రైతుల్లో అసంతృప్తి, నిరుత్సాహం, నిరాశ అలుముకున్నాయి. వ్యవసాయంపై ఉత్సాహం కొరవడింది.

విత్తు..విపత్తు

ఖరీఫ్‌లో ప్రధానంగా పత్తి 2.34 లక్షల హెక్టార్లలో సాగు కానుంది. అయితే పత్తి విత్తనాల్లో నకిలీలు వెల్లువెత్తుతున్నాయి. లూజు పత్తి విత్తనాలు జోరుగా విక్రయిస్తున్నారు. వేరుశనగ విత్తన కాయల పంపిణీ మొదలైనప్పటికీ రైతులకు అరకొర ఇస్తున్నారు. వేరుశనగ విత్తన కాయల్లో మట్టి, రాళ్లు ఎక్కువగా ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. రైతులకు పచ్చి రొట్ట ఎరువుల ఇవ్వడం మరచిపోయారు.

అన్నదాత సుఖీభవ ఏదీ...

2024 ఎన్నికల సమయంలో రైతులకు సంబంధించి అన్నదాత సుఖీభవ కింద ప్రతి ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్-6లో ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత 2024-25 సంవత్సరం ముగిసిపోయింది. మొదటి ఏడాది అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయాన్ని ఇవ్వలేదు. రైతులకు సున్నా వడ్డీ పంట రుణాల జాడ లేకుండా పోయింది.

రైతుల దుస్థితి ఇదీ..

- నైరుతి రుతుపవనాలు గత నెల 26వ తేదీనే విస్తరించినప్పటికీ తర్వాత వాటిలో చురుకుతనం తగ్గింది. వర్షాలు అంతంతమాత్రానికే పరిమితం అయ్యాయి.
- ఖరీఫ్ సాధారణ సాగు 4,22,540 హెక్టార్లు ఉండగా ఇప్పటి వరకు 7,404 హెక్టార్లలో వివిధ పంటలు సాటయ్యాయి. ఇందులో పత్తి మాత్రమే 7,072 హెక్టార్లలో సాగు కాగా మిగిలిన పంటలన్నీ 400 హెక్టార్లకే పరిమితమయ్యాయి.
- మే నెలలో పలు ప్రాంతాల్లో పత్తి సాగు చేశారు. పత్తి కోలుకోవాలంటే ప్రస్తుతం వర్షాల అవసరం ఎంతో ఉంది.
- ఖరీఫ్‌లో 25 వేల మట్టి నమూనాలను పరీక్షించాల్సి ఉంది. రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు ఇప్పటికే దాదాపు 85 శాతం వరకు మట్టి నమూనాలు సేకరించి ఎమ్మిగనూరు, కర్నూలు భూసార పరీక్ష కేంద్రాలకు పంపారు. ఫలితాలు ఇవ్వడానికి ఎంతకాలం పడుతుందో ఊహించుకోవచ్చు. భూసార పరీక్ష కేంద్రాల్లో కెమికల్స్ కొరత తీవ్రంగా ఉందని తెలుస్తోంది.

అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తున్నాం



వర్షాలు అంతంతమాత్రమే ఉన్నాయి. విత్తనాలు సమస్య నెలకొంది. ఈ సారి గ్రామాల్లో ఏరువాక సందడి లేకుండా పోయింది. ప్రభుత్వం నుంచి సాగుకు ఎటువంటి ప్రోత్సాహం లేదు. బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదు. అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తున్నాం. ఇప్పటికైన ప్రభుత్వం చొరవ తీసుకొని రైతులకు చేయూత ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉంది.

– బి.వెంకటేష్, ముక్కెళ్ల, తుగ్గలి మండలం

మందుబాబులకు భారీ జరిమానా

కర్నూలు: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన 8 మందికి భారీ జరిమానా విధిస్తూ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నగరంలో ప్రతి రోజూ ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 8 మంది మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడగా బుధవారం వారిని పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. దీంతో వారి నుంచి రూ.80 వేలు అపరాధ రుసుం కట్టించినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

చిన్నారిపై వీధి కుక్క దాడి


గాయపడిన మమత

బేతంచెర్ల: పట్టణంలోని బోయపేట కాలనీలో ఆరు సంవత్సరాల చిన్నారిపై వీధి కుక్కదాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోని బోయపేట కాలనీకి చెందిన మధు, రామాంజనేయులు కుమార్తె మమత తోటి పిల్లలతో కలిసి ఇంటి వెనక ఉన్న ఖాళీ స్థలంలో ఆడుకుంటూ ఉంది. ఒక్క సారిగా వీధి కుక్క మమతపై దాడి చేసి కుడి కాలు, చేతిపై కరిచి తీవ్రగాయాలు చేసింది. పక్కనున్న వారు కేకలు వేయడంతో కుక్క పారిపోయింది. చిన్నారిని వెంటనే స్థానిక వైద్యశాలకు తరలించి వైద్యం చేయించారు. మే నెల 2వ తేదీన హనుమాన్ నగర్ కాలనీల్లో 4 సంవత్సరాల చిన్నారి బాలుడు షేక్ మొహిద్దీన్ కుక్కల దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలోని వీధి కుక్కలను దూరంగా తరలించి చిన్నారులకు రక్షణ కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మహిళా ఉద్యోగి ప్రాణం తీసిన రోడ్డు ప్రమాదం


ముకుంద ప్రియ (ఫైల్)

ఓర్వకల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గ్రామ సచివాలయ మహిళా ఉద్యోగి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా వెంకటాంపల్లి గ్రామానికి చెందిన చంద్రారెడ్డి భార్య ముకుంద ప్రియ ఓర్వకల్లు మండలంలోని నన్నూరు గ్రామ సచివాలయం-2లో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా రు. భర్త చంద్రారెడ్డి ఆర్మీకి వెళ్లడంతో కర్నూలులో నివాసముంటున్న తల్లిదండ్రుల వద్ద ముకుంద ప్రియ నివాసముంటున్నారు. ఈమె ప్రతిరోజూ కర్నూలు నుంచి స్కూటీపై విధులకు హాజరయ్యేవారు. ఈ క్రమంలో గత నెల 20వ తేదీన స్కూటీపై విధులకు వెళ్తుండగా రోడ్డుపై నిలబడిన లారీని ఢీకొట్టారు. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలై ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తండ్రి రుక్మాంద రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ చెప్పారు.

నూతన వధువు ఆత్మహత్య


మృతిచెందిన శృతి

కోడుమూరు రూరల్: చెప్పులు కొనేందుకు భర్త డబ్బులు ఇవ్వక పోవడంతో మన స్తాపం చెందిన ఓ నూతన వధువు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కోడుమూరు మండలంలోని వర్కూరు గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని వర్కూరు గ్రామానికి చెందిన రామాంజినేయులు కుమార్తె శృతి (16)ని కోడుమూరుకు చెందిన నాగరాజుకు ఇచ్చి మేనెల 9న పెద్దలు వివాహం చేశారు. అప్పగింతలనంతరం ఈనెల 7న నూతన వధువు శృతి భర్త నాగరాజుతో కలిసి పుట్టినిల్లు అయిన వర్కూరు గ్రామానికి వెళ్లింది. అక్కడ శృతి తాను కొత్త చెప్పులు కొనేందుకు డబ్బులివ్వాలని భర్తను అడ్డుగగా, భర్త తానే కోడుమూరులో కొనిస్తానని చెప్పాడు. దీంతో భర్తపై అలిగి తీవ్ర మనస్తాపానికి లోనై శృతి అదే రోజు వాస్మోల్ ఆయిల్ తాగి అపస్మారక స్థితికి చేరుకోగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి తల్లి సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోడుమూరు ఎస్‌ఐ ఎర్రిస్వామి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంకెన్నాళ్లు..రేకుల కంపార్ట్‌మెంట్లు!

- క్యూ కాంప్లెక్స్‌లలో భక్తుల కష్టాలు
- రేకుల కంపార్ట్‌మెంట్లలో ఉక్కపోత
- గత ప్రభుత్వంలో రూ.75 కోట్లతో నూతన క్యూ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన
- ఏడాదైనా పట్టించుకోని కూటమి ప్రభుత్వం


శ్రీశైల దేవస్థానంలోని రేకుల షెడ్డు కంపార్ట్‌మెంట్లు

శ్రీశైలంటెంపుల్: మనస్సు ప్రశాంత, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకునేందుకు పలువురు భక్తులు శ్రీశైల యాత్రకు తరలివస్తారు. మల్లన్న దర్శనానికి వెళ్లాలంటే గంటల తరబడి నరకయాతన పడాల్సిందే. శ్రీశైల దేవస్థానంలో రేకుల షెడ్డులో క్యూ కంపార్ట్‌మెంట్లు ఉండడంతో ఎండలకు, వానలకు భక్తులు అవస్థలు పడుతున్నారు. తక్కువ మంది భక్తులు పట్టే సామర్థ్యం కలిగిన కంపార్ట్‌మెంట్లు ఉండడం, భక్తులను దర్శనానికి గంటల తరబడి కంపార్ట్‌మెంట్లలో వేచిఉంచడంతో ఉక్కపోతతో చంటిపిల్లలు, వృద్ధులు, మహిళల అవస్థలు ఆ పరమేశ్వరుడుకే ఎరుక అన్నట్లుగా మారింది.మంగళవారం నుంచి శుక్రవారం వరకు 10వేల నుంచి 15వేల మంది భక్తులు, శని,ఆది, సోమవారా ల్లో 15వేల నుంచి 20వేల మంది భక్తులు ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటారు. ఇక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో, ఉగాది ఉత్సవాల్లో రోజుకు లక్ష మంది, కార్తీకమాసం, ఇతర ముఖ్యమైన పర్వదినాల్లో 50వేలకు పైగా భక్తులు ఉచిత క్యూలైన్ ద్వారా స్వామిఅమ్మవార్ల దర్శనానికి వెళ్తారు. రద్దీ నేపథ్యంలో తోపులాటల జరగకుండా దేవస్థానం క్యూ కంపార్ట్‌మెంట్లను అందుబాటులోకి తెచ్చింది. 17 కంపార్ట్‌మెంట్లలో మొత్తం 10,100 మంది ఉచిత దర్శన క్యూలైన్ ద్వారా దర్శించుకునే అవకాశం ఉంది. అలాగే శీఘ్ర(రూ.150), అతిశీఘ్ర(రూ.300) క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్ల దర్శనానికి వెళ్లేందుకు ఎనిమిది కంపార్ట్‌మెంట్లలో 3, 360 మంది భక్తులు,క్యూలైన్ (స్టాండింగ్) 5,300 మంది భక్తులు,వృద్ధులు, దివ్యాంగుల కోసం 1200 వేచి ఉండే నాలుగు క్యూలైన్లు,ఆలయంలో లోపల 1700 మంది వేచిఉండేలా నాలుగు ప్రత్యేక క్యూలైన్లు మా త్రమే ఉన్నాయి.మొత్తంగా 25 కంపార్ట్‌మెంట్లలో 15,500 మంది భక్తులు వేచిఉండే అవకాశం మాత్రమే ఉంది.

భక్తుల కష్టాలు పరమేశ్వరుడికెరుక..

శ్రీశైల దేవస్థానంలో ఉన్న 25క్యూ కంపార్ట్‌మెంట్లు రేకులషెడ్డులే కావడంతో భక్తులు ఆయా కంపార్ట్‌మెంట్లలో ఎండపోతకు, వానలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. క్యూ కంపార్ట్‌మెంట్లలో ఫ్యాన్లు ఉన్నప్పటికీ వందలాది మంది భక్తులకు కంపార్ట్‌మెంట్లలోకి అనుమతించడంతో ఫ్యాన్ల గాలి సరిపడడం లేదు. దీంతో చంటి పిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొన్ని సందర్భాలలో భక్తులకు ఊపిరి ఆడక కంపార్ట్‌మెంట్ల నుంచి దర్శనానికి వెళ్లకుండా బయటికి వచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గంటల తరబడి క్యూ కంపార్ట్‌మెంట్లలో భక్తులు అవస్థలు పడుతున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.


క్యూ కంపార్ట్‌మెంట్లలో ఉక్కపోతతో అవస్థలు పడుతున్న భక్తులు

ప్రతిపాదనలను సవరించి పంపాం



నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మాణంపై గతంలో ప్రతిపాదించిన ప్రతిపాదనలను సవరించి పంపించాం. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రూ.79 కోట్లతో నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మాణం ఏ ప్రదేశంలో చేపడతామో తగు ప్రతిపాదనలను రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్, చీఫ్ ఇంజినీర్ అనుమతి కోసం పంపాం. అనుమతులు రాగానే టెండర్ ప్రక్రియ పూర్తిచేస్తాం. త్వరలోనే క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులు చేపడతాం.

– శ్రీనివాసరావు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

నిలిచిన టెండర్..

శ్రీశైల దేవస్థానంలో ఉన్న రేకులషెడ్డు క్యూ కంపార్ట్‌మెంట్లలో భక్తులు పడుతున్న కష్టాలను చూసిన అప్పటి శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి అప్పటి ప్రభుత్వాన్ని ఒప్పించి రూ.75 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన నూతన క్యూకాంప్లెక్స్ నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. అటు తరువాత క్యూ కాంప్లెక్స్‌కు టెండర్లు సైతం పిలిచారు. కానీ 2024 సార్వత్రిక ఎన్నికలు రావడంతో టెండర్ల ప్రక్రియ అర్ధాంతరంగా ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్నా నూతన క్యూ కాంప్లెక్స్‌పై ఇంత వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. పాత రేకుల షెడ్డుల కంపార్ట్‌మెంట్లలో భక్తులు అవస్థలు పడుతున్నా ఇటు దేవదాయశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు.

ఉక్కపోతతో అల్లాడుతున్నాం



శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దర్శనార్థం 50మందితో బృందంగా వచ్చాం. ఉచిత దర్శన క్యూలైన్ ద్వారా దర్శనానికి వెళ్లాం. కంపార్ట్‌మెంట్లలో ఫ్యాన్లు ఉన్నప్పటికీ అందరికీ సరిపడా గాలి రావడం లేదు. ఉక్కపోతతో అల్లాడిపోయాం. సాధారణ రోజుల్లోనే దర్శనానికి రెండు గంటలు పట్టింది. రద్దీ రోజుల్లో వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో. కంపార్ట్‌మెంట్లలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి.

– బాలాజీ, గురువాయర్, కేరళ

నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మించాలి



శ్రీశైలం దేవస్థానంలో వెలసిన శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి వార్ల దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. మా తల్లిదండ్రులతో పాటు మేము శ్రీశైలానికి ప్రతి ఏటా వస్తున్నాం. గతంతో పోలిస్తే కొన్ని సౌకర్యాలు మెరుగుపడ్డాయి. కొన్నేళ్ళ నుంచి ఇవే కంపార్ట్‌మెంట్లు, ఇవి మాత్రం మెరుగుపడటం లేదు. భక్తులకు అన్ని సౌకర్యాలతో కూడిన నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుంది. దేవదాయశాఖ ఆ దిశగా చర్యలు చేపడితే బాగుంటుంది.

– కార్తికేయ, హైదరాబాద్

వ్యవసాయ శాఖలో కలకలం

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కుంభకోణం

- దారిమళ్లిన రూ.97.55 లక్షల జాతీయ ఆహార భద్రత మిషన్ నిధులు
- తాజాగా జూనియర్ అసిస్టెంట్ రాజేష్ సహా ఐదుగురికి మెమోలు జారీ
- ఎందుకు ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేయరాదో చెప్పాలంటూ నోటీసులు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖలో 2016 డిసెంబర్ నుంచి 2019 ఫిబ్రవరి వరకు జాతీయ ఆహార భద్రత మిషన్ నిధుల కుంభకోణానికి సంబంధించి కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కుంభకోణం టీడీపీ హయాంలో, అంటే 2019 మే నెలలో వెలుగు చూసింది. వ్యవసాయ శాఖకు చెందిన జూనియర్ అసిస్టెంట్ జి.రాజేష్ జాతీయ ఆహార భద్రత మిషన్ నిధులు రూ.97.55 లక్షలు తన భార్య స్వాతి పేరుతో స్వాతి ఏజెన్సీస్, స్వాతి ఆగ్రో ఇండస్ట్రీస్, స్వాతి పైప్ ప్రైవేటు లిమిటెడ్ పేర్లతో బోగస్ ఫర్మ్‌లను సృష్టించి నిధులు మళ్లించారు. ఈ కుంభకోణంలో జూనియర్ అసిస్టెంట్ రాజేష్‌తో పాటు అప్పట్లో జేడీఏలుగా పనిచేసిన ఉమామహేశ్వరమ్మ(ప్రస్తుతం అనంతపురం జిల్లా వ్యవసాయ అధికారి), ఠాగూర్ నాయక్(పదవీ విరమణ చేశారు), ఏడీఏ గిరీష్(ప్రస్తుతం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ), ఏవో అశోక్‌కుమార్ రెడ్డి బాధ్యులుగా ఉన్నారు. తాజాగా కుంభకోణానికి సంబంధించి ఐదుగురిని ఉద్యోగాల నుంచి ఎందుకు డిస్మిస్ చేయరాదో చెప్పాలని వ్యవసాయ శాఖ ప్రిన్స్‌పల్ రాజశేఖర్ నోటీసులు జారీ చేయడం వ్యవసాయ శాఖలో చర్చనీయాంశమైంది.

రూ.1.54 కోట్ల ఆస్తులు అటాచ్ చేసిన ప్రభుత్వం

ఈ కుంభకోణానికి సంబంధించి అసలు సూత్రధారి రాజేష్, ఆయన భార్యకు చెందిన రూ.1,54,47,039 విలువ చేసే ఆస్తులను 2019 సెప్టెంబర్ 13న ఆటాచ్ చేస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చిన వెంటనే అప్పటి కలెక్టర్ విచారణకు నాటి జేసీ-2 మణిమాల ఆధ్వర్యంలో నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ విచారణ జరిపి కుంభకోణానికి పూర్తి బాధ్యత జూనియర్ అసిస్టెంట్ రాజేష్‌దేనని, అయితే అధికారుల పర్యవేక్షణ లోపం ఉందని తేల్చింది. దీనిపై 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు కూడా నమోదైంది. కేసులో ఏ1గా రాజేష్, ఏ2గా రాజేష్ భార్య స్వాతి, ఏ3గా ఏడీఏ గిరీష్‌ను చేర్చారు. అయితే పోలీసుల దర్యాప్తులో గిరీష్‌కు సంబంధం లేదని తేల్చి కేసు నుంచి తప్పించారు. తాజాగా రాజేష్ సహా ఐదుగురిని ఉద్యోగాల నుంచి ఎందుకు తొలగించకూడదో చెప్పాలని వ్యవసాయ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశమవుతోంది. నోటీసుల్లో నలుగురు అధికారులపై ఆరోపణలు నిర్ధారణ కాలేదంటునే ఎందుకు డిస్మిస్ చేయరాదో చెప్పాలని కోరడం గమనార్హం.

పింఛన్ తీసుకొస్తూ వృద్ధుడి మృతి


కల్వర్టుపై నుంచి పడి మృతి చెందిన వృద్ధుడు


మద్దిలేటి (ఫైల్)

కోసిగి: పింఛన్ తీసుకుని వస్తూ నిద్రమత్తులో కల్వర్టు నుంచి కిందకు పడిపోయి వృద్ధుడు మృతి చెందాడు. మండల పరిధిలోని ఐరన్‌గల్- పెద్దభుంపల్లి గ్రామాల మధ్య ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు బుధవారపేటకు చెందిన జగ్గుల మద్దిలేటి(64) గతంలో కడపలో బీడీ కార్మికుడిగా పని చేసేవాడు. ప్రతి నెలా కడపకు వెళ్లి పింఛన్ కోసం తెచ్చుకునేవాడు. ఈ నెల 8న కడపకు వెళ్లి 9వ తేదీన రైలులో మంత్రాలయం రైల్వే స్టేషన్ వచ్చాడు. అక్కడ నుంచి ఎటు వెళ్లాలో తెలియక పట్టాల వెంబడి నడుచుకుంటూ మంగళవారం సాయంత్రం ఐరన్‌గల్ గ్రామ సమీపానికి వచ్చాడు. పొలాల్లోని కల్వర్టుపైన నిద్రించాడు. కల్వర్టు నుంచి కిందకు పడిపోయి మృతి చెందగా బుధవారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు గుర్తించారు. సమాచారం తెలుసుకుని పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుని ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చెరుకుని మృతిదేహాన్ని కర్నూలుకు తీసుకెళ్లారు.


అల్లు అర్జున్ గెటప్‌తో తగ్గేదిలే అంటున్న యువకులు


వరిగడ్డి చుట్టుకొని..

అదిరేటి డ్రస్సు మేమేస్తే ..

గుడేకల్‌లో వినూత్నంగా ఏరువాక సంబరాలు

- హీరోల గెటప్‌లతో అకట్టుకున్న యువకులు


జవాన్ సినిమాలోని షారూక్‌ఖాన్ వేషధారణతో..


పెద్ది సినిమాలో రామ్‌చరణ్ బ్యాట్స్ పట్టుకున్నట్లు..

ఎమ్మిగనూరురూరల్: అదిరేటి డ్రస్సు మేమేస్తే అంటూ ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని గుడేకల్ గ్రామంలోని యువకులు సరికొత్త రూపంలో దర్శనమిచ్చారు. తమకు నచ్చిన హీరోల గెటప్స్‌తో ఉరేగింపుగా వస్తూ ప్రజలను అకట్టుకున్నారు. సినిమాల్లో అల్లు అర్జున్ , జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, షారుక్ ఖాన్ ధరించిన డ్రస్సులు వేసుకొని అదుర్స్ అనిపించారు. సంచుల వరిగడ్డి చుట్టుకొని, సై సినిమాలో విలన్ వేషధారణతో కనిపించారు. గ్రామంలో బుధవారం సాయంత్రం ఏరువాక సంబరాలు నిర్వహించారు. ఎద్దుల కొమ్ములకు రంగులు వేసి పార్వేట జరపగా.. ఎద్దులు తెంచిన ఆకులను తీసుకునేందుకు ప్రజలు ఎగబడ్డారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.రుద్రగౌడ్, పెద్దలు హాజరయ్యారు.


వార్-2 సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ వేషధారణలో యువకులు


సై సినిమా గెటప్‌తో..

రూ. 58కోట్లతో 'గోరుకల్లు' పనులు

- నీటిపారుదశాఖ మంత్రి రామానాయుడు

పాణ్యం: గోరుకల్లు జలాశయం పెండింగ్ పనుల కోసం రూ.58కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, ఆర్థికశాఖ ఆమోదం రావాల్సి ఉందని నీటిపారుదశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. జలాశయాన్ని పరిశీలించిన అనంతరం బుధవారం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నీటి నిల్వ కోసం రూ. 2.50కోట్లతో మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. జలాశయ బండ్ ఎత్తును పెంచుతామన్నారు. శ్రీశైలం జలాశయ సబంధించి శాశ్వతంగా రిపేరి పనులకు రూ. 30కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే గౌరు చరిత, ఎస్ఈ పునర్దనరెడ్డి, ఈఈ సుభకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేస్తూనే పరలోకాలకు!

- గుండెపోటుతో వ్యక్తి మృతి


మృతి చెందిన జయరాజు

సి.బెళగల్: జీవనోధారమైన ఇంటి నిర్మాణ పనులకు వచ్చిన ఓ వ్యక్తి పని చేస్తూనే మృతి చెందాడు. ఈ దుర్ఘటన మండల కేంద్రం సి.బెళగల్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామానికి చెందిన జయరాజు (35) కు భార్య సంధ్యారాణితో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణ కోసం ఇంటి నిర్మాణ పనులకు వెళ్లేవారు. బుధవారం స్వగ్రామస్తులతోపాటు ఏనుగబాల కూలీలతో కలసి సి.బెళగల్‌కు వెళ్లారు. పనుల మధ్యలోనే జయరాజు అస్వస్థకు గురయ్యాడు. విశ్రాంతి తీసుకోవాలని తోటి కూలీలు సూచించినా వినలేదు. గుండెపోటుకు గురై పని ప్రాంతంలోనే అచేతనంగా మారాడు. గమనించిన తోటి కూలీలు స్థానిక ఆర్ఎంపీ దగ్గరకు తీసుకెళ్లగా.. జయరాజు అప్పటికే మృతి చెందినట్లు తెలిపాడు. దీంతో జయరాజు మృతదేహాన్ని కడిమెట్ల గ్రామానికి తీసుకెళ్లారు. కడుపు చేత పట్టుకుని పనికోసం వచ్చిన వ్యక్తి ప్రాణాలే కోల్పోవడంపై పలువురు విచారం వ్యక్తం చేశారు.

పశుసంవర్ధక శాఖలో కొలిక్కిరాని బదిలీలు

- ఉత్తర్వుల నిలిపివేత

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖలో బదిలీల ప్రక్రియ కొలిక్కి రాలేదు. వాస్తవానికి ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి తర్వాత వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు, ఏరియా హాస్పిటల్ ఏడీలు, డీడీల బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 13 మంది ఏడీలకు స్థానచలనం కలిగింది. ఇందులో ఐదుగురు ఇతర జిల్లాలకు వెళ్లగా.. ముగ్గురు ఇతర జిల్లాల నుంచి వస్తున్నారు. అయితే బదిలీల్లో భారీగా అక్రమాలు జరిగాయని, ఒక సామాజిక వర్గానికి చెందిన వారికే కీలక స్థానాలకు బదిలీ చేశారనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మంత్రికి తెలియకుండా డైరెక్టర్ బదిలీలను ఏకపక్షంగా చేశారనే ఫిర్యాదులు ఉన్నతస్థాయి దృష్టికి వెళ్లడంతో ఉత్తర్వులను నిలిపివేశారు. మంగళ, బుధవారాల్లో మార్పులు చేర్పులపై ముమ్మరంగా కసరత్తు చేస్తున్నప్పటికీ కొలిక్కి రాని పరిస్థితి నెలకొంది. గురువారం ఉదయానికి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.


హొళగుందలో ఎద్దుల పార్వేటను చూస్తున్న ప్రజలు

ఉత్సాహం 'పరుగు'

ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం హొళగుంద, ఎల్లార్తి, హెబ్బటం, గజ్జహళ్లి తదితర గ్రామాల్లో ఎద్దుల పార్వేట (పరుగు పందేలు) వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఉత్సవాన్ని చూడటానికి ప్రజలు భారీగా తరలి వచ్చారు. విజేతగా నిలిచిన ఎద్దులను గ్రామ వీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఎద్దుల యజమానికి బహుమతులు ప్రదానం చేశారు.

– హొళగుంద